నమస్తే తెలంగాణ

# రాజన్న సిరిసిల్ల

5 | కరీంనగర్, మంగళవారం 23 జూలై 2024 | RAJANNA SIRCILLA




## పరుచుకున్న పచ్చదనం

ఇటీవలి వర్షాలతో చెట్టు చేమ పచ్చదనం పరుచుకుంటున్నాయి. జగిత్యాల జిల్లా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ప్రధాన రహదారుల వెంట అడవులు కనువిందు చేస్తున్నాయి. కొద్ది రోజుల క్రితం మోడుబారిన చెట్లు ప్రస్తుతం పచ్చదనంతో ఆకట్టుకుంటున్నాయి. **- సారంగాపూర్, జూలై22**

# నీళ్ల చారు.. ఉడకని అన్నం!

**ఇదీ మధ్యాహ్న భోజనం**

- పోషకాహారం దేవుడెరుగు.. పప్పుగింజ కనిపిస్తే ఒట్టు
- వారానికి మూడు గుడ్లకు ఒక్కటే పంపిణీ
- మచ్చుకైనా కానరాని కూరగాయలు, ఆకు కూరలు
- సర్కారు ఇచ్చే పైసలతో పప్పు వచ్చే పరిస్థితి లేదంటున్న కార్మికులు
- పారితోషికం, కూరగాయలకు బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన
- ఎలా వండాలంటున్న నిర్వాహకులు?

‘నీళ్లచారు.. ఉడికీ ఉడకని అన్నం’ ఇది మెజార్టీ సర్కారు పాఠశాలల్లో పెడుతున్న మధ్యాహ్న భోజనం! జగిత్యాల జిల్లాలో క్షేత్రస్థాయిలో చూస్తే.. పోషకాహారం దేవుడెరుగు, కనీసం చిక్కటిపప్పు అన్నం అందడం లేదు. ఇక కూరగాయలు, ఆకుకూరలు, సాంబారుతో రుచికరమైన భోజనం అందిస్తున్నామని గొప్పలు చెబుతున్నా.. ఎక్కడా మెనూ కానరావడం లేదు. వారానికి మూడు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా.. ఒక్కటికి మించి ఇవ్వడం లేదు. ఇదేంటని భోజన కార్మికులను అడిగితే.. సర్కారు ఇచ్చే పైసలతో పప్పు, కూరగాయలు కొనే పరిస్థితి లేదని, బిల్లులు కూడా రావడం లేదని.. ఇలా ఎలా వండాలని తమ బాధలను వెల్లబోసుకుంటున్నారు. కనీసం గౌరవ పారితోషికం ఇస్తలేరని.. సిలిండర్లు రావడం లేదని, ఏడు నెలలుగా చెల్లింపులే లేవని.. ఇక తమ బతుకులు ఎలా గడిచేదని ఆవేదన చెందుతున్నారు.



తాటిపెల్లి జడ్పీ పాఠశాలలో నీళ్ల పప్పుతో అన్నం



కొడిమ్యాల హైస్కూల్‌లో పప్పు, కోడిగుడ్డు



కోరుట్ల స్కూల్‌లో భోజనం చేస్తున్న పిల్లలు

ఫీల్డ్ విజిట్ FIELD VISIT

జగిత్యాల, జూలై 22 (నమస్తే తెలంగాణ) : విద్యాహక్కు చట్టం 2013 ప్రకారం 8వ తరగతి వరకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం పిల్లలకు కూరగాయలు, ఇతర పౌష్టికాహారానికి నిధులు ఇస్తున్నది. ఇక 9,10వ తరగతి విద్యార్థులకు బియ్యంతోపాటు కూరగాయలు, పౌష్టికాహారం అంతా రాష్ట్ర ప్రభుత్వమే అందజేస్తూ వస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ చాలా అద్భుతంగా కనిపిస్తున్నా జగిత్యాల జిల్లాలో ఎక్కడా ఇది అమలు కావడం లేదు. జిల్లాలో 515 ప్రాథమిక పాఠశాలలు, 84 ప్రాథమికోన్నత పాఠశాలలు, 184 ఉన్నత పాఠశాలల్లో మొత్తం 55,927 మంది విద్యాభ్యాసం చేస్తుండగా, వీరందరికీ ప్రతి రోజూ మధ్యాహ్న భోజనం సిద్ధం చేసి వడ్డిస్తున్నారు. అయితే దాదాపుగా ప్రతి పాఠశాలలో నీళ్ల చారు.. సాంబార్.. ఎప్పుడైనా ఒకసారి కూరగాయల భోజ నం అందజేస్తున్నారు. పెరిగిన ధరల నేపథ్యంలో ఎక్క డా కూరగాయలు, ఆకు కూరలు వండడం లేదు. కేవ లం సొరకాయలు, బెండకాయల వంటివి కొన్ని వేసి, కొంత పప్పు వేసి సాంబర్ చేసి వడ్డిస్తున్నారు. మెనూ తో సంబంధం లేకుండా ఎక్కడ చూసినా ఇలానే భోజనం అందిస్తున్నారు. ఇక వారానికి మూడు సార్లు కోడిగుడ్డు పెట్టాల్సి ఉన్నా.. వారానికి ఒక్కరోజే పెడుతున్నారు. మిగిలిన రోజుల్లో వడ్డించడం లేదు. వెజిటేబుల్ బిర్యాని, కూరగాయల కూర, ఆకు కూరలు దాదాపు వడ్డించడం లేదు.



సాంబార్

### అందించాల్సిన భోజనం

మధ్యాహ్న భోజనంలో పిల్లలకు అందజేయాల్సిన ఆహారానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక మెనూ తయారు చేసింది.

**సోమవారం :** కిచిడి, మిశ్రమ కూరగాయల కూర, కోడిగుడ్డు.
**మంగళవారం :** అన్నం, కూరగాయల కూర, సాంబార్.
**బుధవారం :** అన్నం, మిశ్రమ కూరగాయల కూర, ఆకుకూర, కోడిగుడ్డు.
**గురువారం :** వెజిటబుల్ బిర్యాని, మిశ్రమ కూరగాయల కూర.
**శుక్రవారం :** అన్నం, మిశ్రమ కూరగాయల కూర, సాంబార్, కోడిగుడ్డు.
**శనివారం :** అన్నం, మిశ్రమ కూరగాయల కూర, ఆకు కూర పప్పు.

### డబ్బులు చాలడం లేదని ఆవేదన

సోమవారం మధ్యాహ్న భోజన సమయంలో ‘నమస్తే తెలంగాణ’ జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శించింది. ఈ సందర్భంగా పలువురు మధ్యాహ్న భోజన తయారీదారులు తమ గోడును వెల్లబోసుకున్నారు. మధ్యాహ్న భోజనం తమకు గిట్టుబాటు కావడం లేదని, ప్రభుత్వం ఇచ్చే మొత్తంతో వంట చేయడం సాధ్యం కాదని తెగేసి చెబుతున్నారు. ఆకు కూరలు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటాయని, ప్రభుత్వం ఇచ్చే ధరలకు కొనడం సాధ్యం కాదంటున్నారు. ఇక పప్పుల ధరలు సైతం పెరిగిపోయాయని, ఈ నేపథ్యంలో చిక్కటి పప్పు వేసి కూర చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు. ఒక్క కోడిగుడ్డుకు ప్రభుత్వం ₹4 మాత్రమే చెల్లిస్తుందని, మార్కెట్‌లో ₹7 పలుకుతుందని, అందుకే వారానికి ఒక్కరోజు మాత్రమే కోడిగుడ్డు పెడుతున్నామని చెబుతున్నారు. ప్రభుత్వం సిలిండర్లు ఇవ్వడం లేదని, వాటి ధరలు వందలు దాటి రూ.వేలకు చేరుకోవడంతో కొనుగోలు చేసి వినియోగించడం సాధ్యం కావడం లేదని వాపోయారు. పిల్లలకు నీళ్లలాగా ఉన్న పలుచని చారుతో భోజనం పెట్టడం తమకు సైతం ఇష్టం లేదని, మనస్ఫూర్తిగా వంట చేయడం లేదని, అయితే విధి లేని పరిస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా మధ్యాహ్న భోజన కార్మికులపై కనికరం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. సన్నబియ్యం అంటూ దొడ్డుబియ్యం ఇస్తున్నారని, సన్నబియ్యం నేరుగా అందజేయాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు ఇస్తున్నట్టుగానే పాఠశాలలకు కోడిగుడ్లను సరఫరా చేయాలని, సిలిండర్ ధరను ప్రభుత్వమే భరించాలని, కూరగాయలు, ఆకుకూరలకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చే మొత్తాన్ని పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### అందని బిల్లులు.. గౌరవ వేతనం

మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడు నెలలుగా బిల్లులు మంజూరు కాలేదు. ఇటీవలే ప్రభుత్వం జగిత్యాల జిల్లాకు ₹1,48,34,500 మంజూరు చేయగా, 1,475 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు కొంత చెల్లించారు. ఐదో తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో వంట చేస్తున్న వారికి భోజన తయారీ ఖర్చులతో పాటు కోడిగుడ్డు బిల్లులను ఈ యేడాది జనవరి వరకు చెల్లించారు. అలాగే ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వంట తయారీదారులకు బిల్లులు, కోడిగుడ్డు బిల్లులు ఇచ్చారు. అలాగే, గౌరవ వేతనాన్ని సైతం జనవరి వరకు చెల్లించినట్టు విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అయితే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, జూన్‌కు సంబంధించిన భోజన తయారీ బిల్లులు, గౌరవ వేతనం రాలేదు.

# అన్యాయాన్ని సహించలేకపోయా





- సాహిత్యంలో జరిగిన దుష్ప్రచారాన్ని నా రచనలతో తిప్పి కొట్టా
- దాశరథి అవార్డు మరింత బాధ్యతను పెంచింది
- ప్రముఖ కవి, రచయిత జూకంటి జగన్నాథం

రాజన్న సిరిసిల్ల, జూలై 22 (నమస్తే తెలంగాణ): ‘తెలంగాణ భాష, సాహిత్యానికి జరుగుతున్న అన్యాయాన్ని సహించలేకపోయా. సాహిత్యంలో ప్రముఖ కవి నన్నయ అంటూ సాగిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టినా. కవితలు, బహిరంగ సభల ద్వారా పాల్కురికి సోమనాథుడన్నది ప్రజలకు వివరించా’ అని ప్రముఖ కవి, రచయిత జూకంటి జగన్నాథం పేర్కొన్నారు. తన మూడున్నర దశాబ్దాల ప్రస్థానంలో కథా, రచయిత, కవిగా అనేక రచనలు చేశానని గుర్తు చేసుకున్నారు. దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఏటా ప్రభుత్వం అందించే ప్రతిష్ఠాత్మక ‘శ్రీ దాశరథి కృష్ణమాచార్య అవార్డు’కు ఇటీవల ఎంపికయ్యారు. సోమవారం ఆయన ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ‘నమస్తే తెలంగాణ’కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

**కవిగా ప్రస్థానం ఎలా మొదలైంది?**

**జూకంటి:** మా సొంతూరు తంగళ్లపల్లి. బాల్యంలో ఇక్కడే చదువుకున్న. చిన్నప్పటి నుంచే దినపత్రికలు, నవలలు చదవడం అంటే ఆసక్తి. నాలుగు కిలోమీటర్ల దూరంలోని సిరిసిల్లకు వెళ్లి లైబ్రరీలో పుస్తకాలు తెచ్చుకుని చదువుకునేది. సిరిసిల్లకు చెందిన జక్కని వెంకట్రాజం ప్రోత్సాహంతో కవితలపై ఆసక్తి పెరిగింది. సిరిసిల్ల ప్రజా పోరాటాలు, కల్లోల పరిస్థితులు ప్రభావం చూపాయి. దాంతో కవితలు రాయడం మొదలు పెట్టాను. మొట్టమొదటి కవితా సంకలనం 1993లో రాశా. తర్వాత ప్రపంచీకరణపై ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ 1996లో కవితా సంకలనం రాశా. అప్పటి నుంచి వరుసగా కవితలు, రచనలు, సామాజిక అంశాలతో పాటు ప్రజల జీవితాలను కవిత రూపంలో రాశా.

**ప్రజల్ని ఎలా చైతన్యం చేశారు?**

సిరిసిల్ల మెట్ట ప్రాంతం. నేను సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థలో ఉద్యోగంలో చేరా. ఈ ప్రాంతంలో సాగునీటి వనరులు లేక పోవడం వల్ల విద్యుత్ వినియోగంపైనే వ్యవసాయ రంగం ఆధారపడింది. కరువు, దుర్భిక్ష పరిస్థితులు కండ్లలో తిరిగేవి. దాంతోపాటు తెలంగాణ భాష, సాహిత్యానికి జరుగుతున్న అన్యాయం సహించలేకపోయా. తెలంగాణ సాహిత్యంలో ప్రముఖ కవి నన్నయ అంటూ చేసిన దుష్ప్రచారాన్ని తిప్పికొట్టినా. కవితలు, బహిరంగ సభల ద్వారా పాల్కురికి సోమనాథుడన్నది ప్రజలకు వివరించాం. దాంతో తెలంగాణ ప్రజలు సోమనాథుడిని గుర్తించగలిగారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజలను నడిపించేలా కవితలతో ప్రయత్నం చేశా.

**మీ రచనల గురించి చెబుతారా..?**

ముఖ్యంగా నేను ప్రపంచీకరణమీదే ఎక్కువ దృష్టిపెట్టి కవితలు రాశాను. 1993లో మొదటి కవితా సంకలనం పాతాళ గరిగెను విడుదల చేశా. ఆ తర్వాత పదహారుకుపైగా పుస్తకాలు వచ్చాయి. కన్నడ, తమిళం, హిందీ, ఇంగ్లిష్‌లోకి నా కవితలు అనువాదం అయ్యాయి. అందులో అన్ని సంతృప్తినిచ్చాయని చెప్పవచ్చు. అన్నింటికీ ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. సమాజంలో ప్రపంచీకరణతో బిచ్చగాళ్లను మరింత బిచ్చగాళ్లను చేసింది. ధనవంతులను మరింత ధనవంతుల్ని చేసింది. వ్యవసాయం రైతులను కూలీలను చేసింది. కూలీలను గ్రామాల నుంచి తరిమేసి బడా బాబులను బతికించింది. ప్రపంచ బ్యాంకు అప్పులిచ్చి పాలకులను బానిసలుగా చేసే కుట్రలను ఎండగడుతూ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట రాశా. గంగడోలు ఇలా అన్నీ నాకు తృప్తినిచ్చాయి. అందరి ప్రశంసలు అందుకున్నా. నేటి సమాజంలో సమాన స్థాయిలో అభివృద్ధి జరగాలన్నదే తన లక్ష్యం. అలక్ష్యం మేరకు కవితలు, రచనల ద్వారా నా అభిప్రాయాన్ని నిర్భయంగా రాస్తున్నా.

**దాశరథి అవార్డు రావడంపై ఎలా ఫీలవుతున్నారు?**

నేను 2014 నుంచి ఆలిండియా తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడిగా కొనసాగుతున్నా. 1998లో మొదటిసారి సినారె కవితా పురస్కారం అందుకున్నా. తర్వాత నాకు అవార్డులు చాలా వచ్చాయి. ఇప్పుడు దాశరథి కృష్ణమాచార్య రాష్ట్ర స్థాయి అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకున్నందుకు మరింత ఆనందపడుతున్నా. నాకొచ్చిన ఈ అవార్డు మరింత బాధ్యతను పెంచింది. అవార్డు కమిటీకి ధన్యవాదాలు తెలుపుకుంటున్నా. సామాజిక ఉద్యమాలే ప్రేరణగా ఆధి పత్యాన్ని ప్రశ్నిస్తూనే కవితలు రాస్తుంటాను.



మంత్రులు జూపల్లి, పొన్నం చేతుల మీదుగా సన్మానం పొందుతున్న జూకంటి జగన్నాథం

# తెలంగాణకు కాళేశ్వరమే జీవధార

- మేడిగడ్డపై అసత్య ప్రచారాలు చేసిన కాంగ్రెస్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కరీంనగర్ కార్పొరేషన్, జూలై 22 : తెలంగాణకు ఎప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్టే జీవధారగా నిలుస్తుందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. కేసీఆర్‌ను, కాళేశ్వర ప్రాజెక్టును బద్నాం చేయాలని కాంగ్రెసోళ్లు చేసిన కుట్రలను తట్టుకొని అది ఇప్పటికీ నిలబడి ఉందని చెప్పారు. కరీంనగర్ శ్రీపురం కాలనీలోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మేడిగడ్డ బ్యారేజీ మొత్తం కుంగిపోయిందని, కాళేశ్వరం కొట్టుకుపోయిందని కాంగ్రెస్ పార్టీ, వందల కొద్దీ యూట్యూబ్ చానెళ్లు నెలల పాటు దుష్ప్రచారం చేశాయని, వాళ్ల కుల్లును, కుతంత్రాలును కడిగేస్తూ లక్షల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహాన్ని తట్టుకొని మేడిగడ్డ నిలబడిందని చెప్పారు. ప్రస్తుతం మేడిగడ్డ వద్ద 8 లక్షల 20 వేల క్యూసెక్కుల వరద పోతున్నా చెక్కు చెదరలేదన్నారు. కొట్టుకుపోయిందని కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ప్రజలకు ఏం చెబుతారని ప్రశ్నించారు. బ్యారేజీకి, ఆనకట్టకు మధ్య తేడా తెలియకుండానే మంత్రులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎండకాలంలో ఏ బస్సులైతే వేసుకుని మీరూ, మీ సహచర మంత్రి వర్గం కాళేశ్వరం కూల్చే యాత్రకు వెళ్లారో.. అదే మంత్రి వర్గం మళ్లీ అవే బస్సులేసుకొని నేడు సందర్శించాలని సూచించారు. అబద్ధాలు చెప్పిన పాపానికి ఆ కాళేశ్వర గోదారమ్మ నీళ్లు నెత్తిన చల్లుకుని వస్తే కొద్దిలో కొద్దిగా పాప ప్రాయశ్చిత్తమైనా కలుగుతుందన్నారు. కేసీఆర్ మీద కక్షతో కాళేశ్వరం మీద బురదజల్లే ప్రయత్నం ఎవరు చేసినా చరిత్ర హీనులుగా మిగిలిపోవడం ఖాయమన్నారు. కేసీఆర్‌పై కోపంతో రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలని హితవుపలికారు. సుమారు 235 టీఎంసీల నీటిని ఎత్తిపోయడమే కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యమని పేర్కొన్నారు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేసి నీటిని ఎత్తిపోసి ఉంటే వేసవిలో పంటలు ఎండిపోయేవి కావని, రైతులు ఆత్మహత్యలు చేసుకునే వారు కాదన్నారు. కేవలం కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న లక్ష్యంతో కాళేశ్వరంపై తప్పుడు ప్రచారాలు చేసి రైతుల పంటలను ఎండబెట్టిన దుర్మార్గమైన పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసే ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరమేనని పేర్కొన్నారు. తమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కడుతామనడం వారి కర్మ అని ఎద్దేవా చేశారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో సీడబ్ల్యూసీ నీటి లభ్యత లేదని చెప్పిందని, వైఎస్ఆర్ కాలంలో తవ్విన కాల్వలకు అనుమతులు తీసుకున్నారా..? అని ప్రశ్నించారు. కేవలం వారి జేబులు నింపుకునేందుకు ఈ ప్రాజెక్టును కాంగ్రెస్ నాయకులు వినియోగించుకున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారాలు మాని వెంటనే మరమ్మతులు పూర్తి చేసి రైతులకు నీరు అందించాలని డిమాండ్ చేశారు.





కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

# ఆశ కార్యకర్తల కన్నెర్ర

- డిమాండ్ల సాధన కోసం కదం
- వందల సంఖ్యలో తరలివచ్చి కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

కరీంనగర్ కలెక్టరేట్, జూలై 22 : కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆశ కార్యకర్తలు కన్నెర్ర జేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ కదం తొక్కారు. వందల సంఖ్యలో తరలివచ్చి, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. అధికారమే లక్ష్యంగా కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని, ఎన్నికల్లో గెలిచిన అనంతరం అమలును మరిచిపోయిందని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం సత్వరమే తమ డిమాండ్లు పరిష్కరించాలని, అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. తమ డిమాండ్లపై స్పందించే దాకా ఆందోళన విరమించేది లేదని అక్కడే బైఠాయించారు. కరీంనగర్‌లో రెండు గంటల పాటు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే పరిస్థితులు కనిపించడంతో పోలీసులు భారీగా మోహరించి బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా, వెనక్కి తగ్గకపోవడంతో డీఎంహెచ్‌వోను రప్పించారు. డిమాండ్లను వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు నివేదిస్తామని జిల్లా వైద్యాధికారి హామీ ఇవ్వడంతో ఆశ కార్యకర్తలు ఆందోళన విరమించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ, ఆశ కార్యకర్తలకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి, నెలకు ₹18వేలు అందించాలని డిమాండ్ చేశారు. పరీక్షలు వెంటనే రద్దు చేయాలని, బీసీజీ సర్వే, వ్యాక్సినేషన్ పనికి తగిన పారితోషికం అందించాలని కోరారు. ప్రతి ఆశ కార్యకర్తలకు ₹50లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, పదవీ విరమణ ప్రయోజనం కింద ₹5లక్షలు చెల్లించాలని, అనంతరం ప్రస్తుతమందిస్తున్న వేతనంలో సగం పెన్షన్‌గా మంజూరు చేయాలని విన్నవించారు. ఏటా 20 రోజులు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, అలాగే, ఏఎన్ఎం, జీఎన్ఎంగా పదోన్నతి అవకాశం కల్పించాలన్నారు. ఆరోగ్య అధికారుల ద్వారా చేసే వైద్య పరీక్షలు ఆశ కార్యకర్తలకు అప్పగించవద్దన్నారు. జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల పీఆర్సీ ఏరియర్స్ చెల్లించాలని, లెప్రసీ సర్వే డబ్బులు సత్వరమే విడుదల చేయాలన్నారు. యూనిఫామ్‌లు అందజేయాలని, పనిభారం తగ్గించేందుకు జాబ్ చార్ట్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం శ్రీలత, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు యూ శ్రీనివాస్, గుడికందుల సత్యం, జీ రాజవేశం, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శారద, నాయకురాళ్లు లక్ష్మి, లత, సుజాత, శ్యామల, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

### హ్యాపీ బర్త్ డే వినోదన్న..

రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పూజలు చేసి, కేకులు కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కొన్నిచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించగా, మరికొన్ని చోట్ల పండ్లు పంపిణీ చేయడంతో పాటు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ ‘హ్యాపీ బర్త్ డే టూ వినోదన్న’ అంటూ శుభాకాంక్షలు తెలిపారు.

**- కరీంనగర్ కార్పొరేషన్, జూలై 22**



కరీంనగర్‌లో రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, నాయకులు నాగరాజు, తదితరులు

### ఆర్ఎంవోగా డాక్టర్ శోభారాణి



విద్యానగర్, జూలై 22: గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కరీంనగర్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్‌గా (ఆర్ఎంవో) డాక్టర్ శోభారాణిని నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆమె సోమవారం దవాఖానలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది కలిసి ఆమెకు అభినందనలు తెలిపారు. శోభారాణి అంతకుముందు హన్మకొండలో విధులు నిర్వర్తించారు. ఉద్యోగోన్నతిలో భాగంగా కరీంనగర్ జనరల్ హాస్పిటల్‌కి ఆర్ఎంవోగా వచ్చారు.



# ట్రాక్టర్‌లోనే ట్రాన్స్‌ఫార్మర్

- ఐదు రోజులుగా అందులోనే
- నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం

.. ఇక్కడ ట్రాక్టర్‌లో కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్ పరిధిలోని ఇరుకుల్ల రోడ్డులోనిది. 25 హెచ్‌పీ కెపాసిటీ ఉన్న ఇక్కడి ట్రాన్స్‌ఫార్మర్ ఈ నెల 15న కాలిపోయింది. దీంతో రైతులు అదే రోజు తీసుకుని కరీంనగర్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయంలో అప్పగించి మరొకటి తీసుకువచ్చారు. 16న మధ్యాహ్నం ఫిట్ చేసి ట్రయల్ చేయగా మళ్లీ కాలిపోయింది. దీంతో రైతులు ఈ నెల 17న దానిని మళ్లీ కార్యాలయానికి తీసుకుని రాగా, ఆరోజు తొలి ఏకాదశి కావడంతో మరొకటి ఇవ్వడం జరగదని అధికారులు తిరిగి పంపించారు. ఆ మరుసటి ఉదయం రైతులు మళ్లీ ట్రాన్స్‌ఫార్మర్ కోసం కరీంనగర్‌కు వెళ్లి సిబ్బందిని అడుగగా 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్ లేదని చెప్పడంతో చొప్పదండి విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ఎక్ఛేంజ్ చేసుకుని తీసుకుని వచ్చారు. అయితే, దానిని బిగించాలని విద్యుత్ అధికారులను, సిబ్బందిని రైతులు కోరినా వారు రాకపోవడంతో ఐదు రోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ ట్రాక్టర్‌లోనే మూలుగుతున్నది. ఈ విషయమై ఏఈని సంప్రదించగా, వర్షాల వల్ల బిగించలేకపోయామని, సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. **- కరీంనగర్ రూరల్, జూలై 22**


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571